# తుఫానులో పిల్లగాలి!

ఆదూరి వెంకట సీతారామ మూర్తి

"ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్.... హౌఐవండర్ వాట్యూవార్.... అప్పేబౌ....... అప్పేబౌ........"

భానుమూర్తి కళ్ళు విప్పేడు- తూర్పు ఆకాశంలో వెలుగు రేకలు విచ్చుకుంటు న్నాయి- లేచి, గుమ్మం తెర తొల గించుకుని డాబాపైకి వచ్చాడు-

ఆకాశం మీంచి పల్చగా మంచుజారు తోంది. ఉత్తరంవైపునున్న కొండమీద అల్లి బిల్లి ఆటలాడుతూన్నట్లు రెండు పిల్ల మబ్బులు!

డాబా పిట్టగోడకు దగ్గరగా తన చిన్న కేన్‌కుర్చీలో కూర్చొని రెండు చేతులతోనూ పట్టుకున్న పుస్తకాన్ని ముఖానికి దగ్గరగా పెట్టుకుని ఇంగ్లీషు పద్యాలు చదువుతోంది లిల్లి-

భానుమూర్తి కళ్ళు ఆనందంలో మెరిశాయి-

అప్పుడే విచ్చుకుంటున్న లేత గులాబి రేకుల్లో నిక్షిప్తమై అపురూపంగా ప్రకాశించే మంచు బిందువులా వుంది లిల్లి.... .... ఆక్షణాన- ఎర్రగౌనులో ముడుచుకుని-

మంచుకు తడిసి, నేలరాలిన చిన్ని పారిజాతాల్లా లిల్లి పాదాలు నేలమీద పొందిగ్గా వూగుతున్నాయి-

'అప్పుడే లేచేవేం తల్లీ....' అడిగేడు భానుమూర్తి.

'మరి చదూకో వద్దేంటిడాడీ- టీచర్ కివాళ అప్పజెప్పాలికూడ'

'ఓహో అదా సంగతి. సరేచదువుకో. ఆప్పేబౌ దివోళ్ళ్‌సో హై లై వెడైమండ్ ఖుందస్కై" అంటూ అందిచాడు.

"వచ్చేసింది డాడీ- నువ్వు కాఫీ తాగి వచ్చేసరి కల్లా పూర్తిగా అప్ప జెప్పేస్తానేం?"

'ఆలాగే' అంటూ ముందుకు కదిలేడు భానుమూర్తి.

° ° °

"మమ్మీ- ఓ సారిలా రావూ?"

లిల్లి పిలుపుకు వంటగదిలోంచి వచ్చింది వసంత-

"ఈ లిల్లీ పూలు చూడు ఎంత బావున్నాయో"

"బావున్నాయి. అచ్చం నీలాగే"

"నాలాగా? అంటే ఎలా మమ్మీ?"

"అంటే... నీలాగ ముద్దుగా, చిన్నగా తెల్లగా.........."

"ఓహో! మరి తెల్లగాను, తెల్లకె ట్సూ, సాక్సూ అన్నీ సరిపోయాయిగదూ? భలే భలే...."

"అవును సుమీ- సరిగ్గాసరిపోయాయి నవ్వేసింది వసంత.

"మరాపువ్వుల్ని నువ్వు తెంపేసి తల్లో పెట్టుకోగూడదేం?

"ఎందుకేమిటి?"

"తెంపేస్తే పాపం వాడిపోతాయిగా"



కూతురిలోని కళాత్మక దృష్టికి అబ్బుర పడింది వసంత- ఆమె మనసులో ఎక్కడో ఓ పన్నీటి జల్లు! మొగ్గ పూర్తిగా వికసించకుండానే వ్యాపించే పరిమళంలా లిల్లి లోని కళాత్మక భావాలు ఎప్పటికప్పుడు కన్పిస్తూనే వున్నాయి- పసి పిల్లపుడు పాల మీగడలాంటి గౌను తొడిగి, పౌడరద్ది ఆరుబయట మంచం మీద పడుకోబెడితే నీలాకాశంలో పరుగులెత్తే మబ్బుల్నీ పిట్టల్నీ చూసి సంతోషంతో కాళ్ళు కొట్టి చిన్ని మువ్వల్ని చప్పుడు చేసేది- పక్షుల కిలకిల విన్పిస్తే అటువైపు తల తిప్పి; ముత్యపు చిప్పల్లాంటి కళ్ళతో పలికించేది!

"మమ్మీ టాటా! పుస్తకాల సంచి తీసుకుని మెట్లు దిగింది లిల్లి-

'టాటా' అంటూ ఆ వంకే చూస్తూ వుండి పోయింది వసంత.

"ఒక్క తప్పు కూడ లేకుండా చెప్పిన లిల్లీదే ఫస్టు మార్కు" చెప్పింది ఇంగ్లీషు టీచరు- క్లాసులో అందరి ముందూ గర్వమనిపించింది లిల్లీకి- దాచుకోలేని ఆనందం ఆ చిన్ని బుగ్గల్లోంచి చిలిపిగా, దొంగలా బయట పడింది- అయితే ఆ ఆనందం, ఉత్సాహం మధ్యాహ్నం వరకే వున్నాయి తెలుగు టీచరిచ్చిన హోంవర్కు చేయలేదు తను- అందుకని వెనుక బెంచీమీదకు పంపించేసింది టీచరు. అక్కడ కూర్చుని హోంవర్కు పూర్తి చేసి చూపమంది-

కళ్ళంట నీళ్ళు తిరిగాయి లిల్లీకి- తెలుగు టీచరెప్పుడూ హోంవర్కిచ్చి, కోప్పడ్డమే తప్ప పిల్లలతో సరదాగా వుండదు. కబుర్లు చెబుతూ పాఠాన్ని కథలుగా చెప్పదు.

కొత్త పద్యం మొదలు పెట్టి, తను చెబుతూ క్లాసులో ప్రతి ఒక్కరి చేతా చెప్పిస్తోంది టీచర్. లిల్లికి చెప్పలేనంత దుఃఖం కలిగింది- తను తప్ప తక్కిన వారంతా పద్యాన్ని చెబుతున్నారు- హోంవర్కు చేయని నేరానికి తను కొత్త పద్యం నేర్చుకుందికి వీల్లేక పోతోంది.

బుగ్గలమీదుగా కారుతూన్న కన్నీళ్ళను తుడుచుకుంటూనే అక్షరాల్ని రాస్తోంది లిల్లి- ఎప్పుడు బెల్ అయిందో మరి!

అదే ఆఖరి పీరియడ్ కావటాన పిల్లలంతా వెళ్ళిపోయారు- లిల్లికి పట్టుదల పెరిగింది- ఆ వర్కుతో పాటు ఆ రోజిచ్చిన హోంవర్కంతా చేస్తేనే గాని అక్కడ్నించి లేవకూడదనుకుంది- హోంవర్కు చేయనందుకేగా తనను టీచర్ వేరు చేసిందీ?

ఏడ్చిన అలసట వల్లా, ఉదయాన్నే నిద్రలేవడం వల్లా లిల్లి కనురెప్పలు బరువుగా మూతలు పడుతున్నాయి-

ఆక్షణంలో బయట వాతావరణం వూహించనంతగా మారిపోయిందని గానీ తను ఎక్కాల్సిన స్కూలు బస్సు తనను వదిలి వెళ్ళి పోయిందని గానీ లిల్లికి తెలీదు-

తెలిసేసరికి......... చుట్టూ భయంకర నిశ్శబ్దం!

○ ○ ○

భయంకర నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఎక్కడో వురుము వురిమింది- ఉలిక్కిపడి ఆకాశం వంక చూసింది వసంత- కారుమబ్బులు అల్లకల్లోలంగా పరుగులెత్తు

ఓసారి ఓ అందమైన నటీమణి బెర్నార్డ్‌షాను కలుసుకుంది. కాసేపు అలీ ఇవీ మాట్లాడాక "మనం పెళ్ళి చేసుకుంటే ఎంతో బావుంటుంది. మన పాపకు మీ తెలివి, నా అందము వస్తుంది..." అందామె ఆశగా.

"అలా జరిగితే బాగానే వుంటుందనుకో! కానీ ఆ పాపకు నీ తెలివి, నా అందము వస్తే?" అంటూ ప్రశ్నించాడు షా నవ్వుతూ. ●

---

తున్నాయి- బంగాళాఖాతంలో ఏర్పడ వాయుగుండం మరింత తీవ్రరూపం దాలుస్తుందని ఆకాశవాణి హెచ్చరిస్తుంది

సాయంత్రం ఆరుగంటలే అయినా రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి-

వసంతలో కంగారెక్కువయింది- ఐదు గంటలకే రావాల్సిన లిల్లి యింకా ఇల్లు జేరక పోవడం, చూస్తుండగానే వాతావరణం బీభత్సంగా మారిపోవడం ఆమెలో ఆందోళననెక్కువ చేస్తున్నాయి ఆమె చూపులు ఆత్రంతో వీధి వైపే వున్నాయి- ఏ పనీ తోచటం లేదు. ముసురుకుంటున్న ఆలోచనల నిండా ఒకే ఒక ప్రశ్న-

చిన్నారి లిల్లి ఎందుకు రాలేదూ?

రోజూ ఆ వేళకి ఆఫీసునుంచి వచ్చే భానుమూర్తి కూడా రాక పోవడం ఆమెకు మరింత ఆశ్చర్యాన్నీ అనుమానాన్నీ కలిగించింది-

నిముషాన్ని శరవేగంతో లాక్కు పోతూందికాలం. ఏడుగంటలయింది- మనసును పిండేసే ఆలోచలను తట్టుకో లేకా, వంటరితనాన్ని భరించలేకా ఒక నిర్ణయాని కొచ్చిందల్లా లేచి, యింటికి తాళం వేసి బయలుదేరింది-

గొడుగు విప్పితే మొత్తంగా ఎగిరి పోయేంత గాలి! దానికి తోడు వర్షం! ఎదురుగా వస్తున్న ఖాళీ ఆటోను కేకేసి బేరమాడకుండానే ఎక్కి పోనీమంది- ఇంకొకప్పుడైతే ఆటోలో వంటరిగా ప్రయాణం చేయడానికే భయపడేది! అటువంటిది యీ వర్షపురాత్రి వంటరిగా ముక్కు-మొహం తెలియని ఆటోలో తన ధైర్యానికి తనే ఆశ్చర్యపోయింది.

తనేమైపోయినా ఫర్వాలేదు- కానీ లిల్లీకి మాత్రం సురక్షితంగా వుండాలి! పట్టుమని ఐదుకిలోమీదర్లు....... ఎంత సేపట్లో చేరుకుంటుంది? ఈలోగా ఏమైనా జరిగినా తనందుకు సిద్ధపడే వచ్చింది-

వర్షాన్నీ గాలినీ చీకటినీ చీల్చుకుంటూ ఆటో ముందుకు పోతోంది- వసంతలోని ఆలోచనలు మాత్రం పరి పరి విధాలు పోతున్నాయి. దగ్గరగా స్కూళ్ళేవీ బాగుండలేదని సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో వూరికిచివర వున్న కాన్వెంట్‌లో పట్టుబట్టి చేర్చేడు భానుమూర్తి. ఆ స్కూల్‌కి స్కూల్ బస్ కూడా వుండటంవల్ల తనేం మాట్లాడలేకపోయింది.

ఒకవేళ బస్సుకేమైనా ప్రమాదం జరగలేదు గదా! ఆలోచన రాగానే వణికిపోయింది వసంత. ఏరోజు పేపరు చూసినా ఎక్కడోక్కడ ఏదోరకమైన ప్రమాదాలే-ఈ ప్రమాదాల నరికట్టడం సాధ్యంకాదా?

తమ కాలనీకి కాస్త దూరంలోనే ఆగుతుంది బస్సు-కనీసం బస్సు వచ్చిందో లేదో కనుక్కోకుండా బయల్దేరినందుకు తనను తాను నిందించుకుంది-

మలుపు తిరగబోతూ పెద్ద కుదుపుతో ఆగింది ఆటో. ఏమైంది ఆటోకి? అప్పుడే వూరు వెలుపలికి వచ్చేశారు-అక్కడికి స్కూలు మరో రెండు కిలో మీటర్లుంటుంది- గాలీ, వర్షం వుధృతంగానే వున్నాయి-దానికి తోడు రోడ్డంతా చీకటిగావుంది- జన సంచారం కూడా అట్టేలేదు. సహాయం కోసం కేకేసినా ఎవరూ పలకని స్థితి-

ఆటో డ్రైవరు ఇంజన్ స్టార్ట్ చెయ్యడానికి ప్రయత్నిస్తున్నా బండి కదలటం లేదు-

'ఏమైందబ్బాయ్' అడిగింది వసంత కాస్త ధైర్యంగానే-వాతేం మాట్లాడలేదు- 'ఏ అఘాయిత్యమూ చేయకముందే దిగి పారిపోతే?' అనే ఆలోచనొచ్చింది. అయినా ఎక్కడికి పోగలదీపరిస్థితిలో-

'మాట్లాడవేమబ్బాయ్? ఏ మైంది ఆటోకి? కదుల్తుందా కదలదా?" ఈ మాట కంఠంలో స్థాయిని పెంచింది- డ్రైవరు వెనక్కుతిరిగి చూశాడు- అప్పుడు చూసిందతని ముఖాన్ని. నల్లగా తుమ్మమొద్దులా వుందాముఖం- వికృతమైన తెల్లని కళ్ళు-తన వైపు చూసి నవ్వుతున్నాడా అనే భ్రమ కలిగిందామెకు- వెనక్కు చూస్తూనే కిందదిగేడు- వసంతలో ఎక్కడలేని శక్తి, ధైర్యం వచ్చాయి-తనబేగ్‌లోకి చెయ్యి పోనిచ్చి ముందు జాగ్రత్తకోసం తెచ్చుకున్న పళ్ళు కోసుకునే చాకుని చేతిలోకి తీసుకుంది- క్షణంలో ఆమె పిడికిళ్ళు బిగిశాయి.

o o o

ఆరంతస్తుల కిటికీలోంచి బయటకు చూశాడు భానుమూర్తి. ఊరంతాచీకటిలో వుంది. గాలి, వర్షం మాత్రం రొద చేస్తూనేవున్నాయి. కరెంటు పోవడంవల్ల లోపల కూడా చీకటిగానేవుంది- అంతా వెళ్ళి పోయారు- వున్నది తనూ, సెక్యూరిటీగార్డూ అంతే. మర్నాడు ట్రస్టీస్ కాన్ఫరెన్సుకు తయారు చెయ్యాల్సిన స్టేట్‌మెంట్ల పనిమీద వుండిపోయాడు తను- ఈ లోగా వర్షం. పవర్ కూడా ఫెయిలయింది-


ఆలోచనల్నీ నిశ్శబ్దాన్నీ చీలుస్తూ ఫోన్ మ్రోగింది. భయంకరంగా- ఎవరై వుంటారు? బాసా? నాలుగంట్లో రిసీవర్ని చేతిలోకి తీసికున్నాడు-

'హలో.... ఆ... భానుమూర్తినే మాట్లాడుతుంటా.... హలో....హలో.... కట్ అయింది కనెక్షను-తనకోసం.... ఎవరు? వసంతా? కాదే! అవతలిది స్త్రీ గొంతు- ఆగొంతులో కాస్త ఆవేదన కూడ!

భానుమూర్తి మనసులో ఎక్కడో ఏదో అనుమానం పొడ చూపింది. ఎవరు ఎవరు చేసివుంటారు తనకిఫోను?

పది నిముషాల పాటు ఫోను దగ్గరే కూర్చున్నాడు. మళ్ళీ రింగయింది. ఆ వెంటనే కట్ అయింది-

అంతే. కుర్చీలోంచి స్ప్రింగులాలేచి గది తలుపు వేసి, ఆరంతస్తులూ రెండు నిముషాల్లో దిగి, ఎదురుగా బస్టాపులో అప్పుడే బయల్దేర బోతున్న సిటీ బస్సు ఎక్కాడు- అప్పటికి రాత్రి ఎనిమిది.




○ ○ ○

పొంగి వస్తున్న దుఃఖాన్ని అదుపులో పెట్టుకోడం సాధ్యం కాలేదు వసంతకు- ఒక్కొక్కప్పుడు కొద్దిపాటి ఆలోచనకే హృదయం తల్లడిల్లి పోతుంది- కన్నీరు వరదలై పారుతుంది- అనుకోని విపత్తు ఎంత పెద్దది సంభవించినా ఒక్కొక్కప్పుడు నీటి బొట్టుకూడా చిందదు- భయం ఆతృతకూడా అటువంటివే- కాక పోతే ఏమిటి? కొద్దినిముషాల క్రితం తన మానం, ప్రాణం కూడా పోతాయనిభయ పడింది- కానీ భయంకరంగా కన్పించిన ఆ ఆటో డ్రైవరే దేవుడిలా తనకు సాయంచేశాడు- సురక్షితంగా ఇల్లు చేర్చాడు. ఆ విధంగానే లిల్లీని గూర్చిన భయంకూడ పొగమంచులా విడిపోతే.... అంతకంటె ఏంకావాలి తనకు?

'భగవంతుడా! నీవేరూపంలో వున్నా యీసృష్టి లయలకు ఆధారభూతుడవు- నువ్వే సృష్టించిన నా చిన్నారి లిల్లీని నాకు దూరంచేయకు అదే నే కోరేవరం' అని అర్థించింది మనసులోనే-

ఆమె కళ్ళ వెంటనీరు ధారాపాతంగా కారిపోతుంది. తనుచేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి- తను వెళ్ళే సరికే స్కూలు తాళం వేసివుంది అడిగేందుకు కూడా మనిషిలేడు-తన ఆతృతను తెల్సుకున్న ఆటో డ్రైవరే కాలనీ అంతా వాకబు చేశాడు- స్కూల్ బస్ అనుకున్న వేళకి సురక్షితంగానే వచ్చింది- కానీ లిల్లీ మాత్రం రాలేదు! కాలనీలో వున్న పిల్లల్ని వాకబు చేసిన వివరాలు తెలియలేదు- భానుమూర్తి ఫోన్ చేసి చెప్పాలనుకున్న ప్రయత్నం కూడా విఫలమైంది. ఏం చేయాలి? వంటరిఆడది యీ స్థితిలో ఏంచేయగలదు?

తన అశక్తతను తనే తిట్టుకుంది వసంత-బయట ఆకాశానికి చిల్లులు పడ్డట్టు వర్షం. వసంత కళ్ళలోనూ కన్నీటి ధార!

○ ○ ○

గాలి వానతగ్గింది-స్కూలు ఆవరణ మళ్ళీ పువ్వుల్లాంటి పిల్లలతో నిండుతోంది- కిండర్‌గార్డెను తరగతులగదులు

తెరవ బడ్డాయి, ఒకగదిలోపల.... కిటికి వూసల్ని పట్టుకొని.... లిల్లి! ఆకలి, దాహం, చీకటి, భయం, వంటరితనం,- వీటిని జయించలేక నిర్జీవమైన చిన్నారి లిల్లి!

"లిల్లీ!" పేగులు తెంచుకున్నట్టున కేక పెట్టింది వసంత-చట్టుక్కు మెల కువ వచ్చి కళ్ళుతెరచి చూసింది- శరీర మంతా వేడెక్కి వణకిపోతోంది- మనసు మారు మూల ఎక్కడో....దెబ్బ! ఏం జరిగింది లిల్లికి? ఇదంతా కలేనా? అను మానంతో పెదత్రోవ పట్టించే ఆలోచనల ఫలితమేనా మగతలోకి యీ వూహ? ఎప్పుడో.... ఎక్కాడో యిటువంటి వార్తనే వింది. మనుషుల్లో దౌర్జన్యం, క్రూరత్వం ఎంత ప్రమాదకరములో నిర్లక్ష్యంకూడా అంతే ప్రమాద కరమైన దని నిరూపించిందా సంఘటన- తుఫా నులో ఒంటరిగా చీకటిగదిలో చిక్కుకు పోయిన ఆ పసిప్రాణి కొన్ని రోజుల పాటుఎంతనరకయాతననుభవించిందో! భగవాన్ వూహలోకూడా భరించలేనిది!

మరి.... లిల్లికూడా అలానే బంధింప బడిందా?.... వీల్లేదు.... అలా జరగ డానికి వీల్లేదు- నాలిల్లి నాక్కాకుండా పోడానికివీల్లేదు!

సరిగ్గా అదే సమయంలో తలుపు తట్టిన శబ్దమైంది- ఒక పరుగులో వెళ్ళి, తలుపు తెరిచింది- ఎదురుగా...తడిసిన బట్టల్లో.... ఆతృత, దైన్యం కలగలసిన ముఖంతో... భానుమూర్తి!

కట్టలు తెగిన దుఃఖంతో భోరుమని ఏడుస్తూ మానులా కూలిపోయింది.

ం ం ం

భానుమూర్తి వంక జాలిగా చూసింది మేరీ టీచర్. ఆమె వెనకే నైట్‌గౌన్‌లో ఆమె భర్త జాన్.

మీరీ విషయంలో నాకు హెల్ప్ చెయ్యాలి. మా లిల్లి క్లాసులోనే వుండి పోయిందేమోనని అనుమానం-' భాను మూర్తికళ్ళలో నీళ్ళు తిరగాయి-

'సూలు తాళాలెప్పుడూ రంగయ్యే వేస్తాడు- మీకతని యింటి అడ్రసు చెబుతాను. వెళ్ళగలరా?' మేరీ టీచర్ ప్రశ్నకు వెళ్ళగలనన్నట్లు తలూపేడు భానుమూర్తి 'ఒకవేళ తాళాలు ప్రిన్సి పాల్ దగ్గరేవున్నా వారింటికి అతనేదారి చూపిస్తాడు' అంది.

'మీకు వెహికిల్ ఏమైనా వుందా' అడిగాడామె భర్త జాన్. లేదన్నట్లు తలూపి; మీఇల్లు కనుక్కోవడమే గగన మైపోయింది. అదృష్ట వశాత్తూ మిమ్మల్ని కలిశాను- మీ సహాయంతో నా లిల్లిని రక్షించుకోగలననే ధైర్యం కలుగుతోంది'

ఆ మాటలు వింటూ జాన్ కళ్ళలోకి చూసింది మేరీ- ఆ చూపులో ఏఅర్థ ముందో.

'సరే పదండి- నా మోటర్ బైక మీద వెళ్దాం అన్నాడు జాన్.

భానుమూర్తి కళ్ళలో కృతజ్ఞతా భావము కదులాడిందాక్షణాన.

"రోజులాగే అన్ని తలుపులూ నేనే వేశాను- లోపల ఎవరూ వుండిపోలేదు. నా మాట నమ్మండి అన్నాడు రంగయ్య వారి మాటలు విని-

'తాళం చెవులెవరి దగ్గరుంటాయి?' అడిగేడు జాన్.

'ప్రిన్సిపాల్ బాబుగారి దగ్గరే వుంటాయెప్పుడూ'

'వాళ్ళింటికెళ్ళాలి రంగయ్యా- నువ్వోమారు రావాలి" జాన్ మాటలకు రంగయ్యే మాట్లాడలేదు వెంటనే. అర్ధ రాత్రి... అందులోనూ వర్షం!

"కొసవాటు పాక బాబయ్యా- మా యాకది చంటిబిడ్డ తల్లి- ఒక్కదాన్నే ఒగ్గేస్తే...." రంగయ్య చెప్పేదేమిటో అర్థమై యిద్దరికీ-

'నిజమే రంగయ్యా కానీ సాటి మని షికి మనం యీపాటి సాయ పడకపోతే ఎలా చెప్పు. నువ్వొ మా బండిమీదే వచ్చెయ్యి- మళ్ళీ వెంటనే నిన్నిక్కడ దింపే పూచీనాది' జాన్ మాటలను తోసెయ్యలేక కాబోలు బయల్దేరేడు రంగయ్య- అప్పటికి వానజోరు తగ్గగా గాలిజోరు మాత్రం తగ్గలేదు-

'అన్నట్టు సెప్పడం మర్సేపోయాను- రేపు సెలవా; ఎల్లుడి ఆదోరమూ గాబట్టి బాబుగారు వూ రె ల్తన్నా రీ రాతిరికి.' అన్నాడు రంగయ్య మోటర్ సైకిల్ ఎక్కబోతూ- ఆ ముక్కతో నీరుగారి పోయాడు భానుమూర్తి. భయం ఆతృత స్థానాల్లో నిరాశ చోటుచేసుకుందాయన హృదయములో.

"ఏవూరు? ఎన్ని గంటల ట్రైనుకి? జాన్ అడిగాడు- తనకు తెల్సిన సమా చారాన్ని చెప్పేడు రంగయ్య-

జాన్ వాచీ చూ చుకు న్నా డు - పన్నెండున్నర- ఎక్కడో ఒక గజ్జి కుక్క కుయ్యోమని అరిచింది-

ఒక్క క్షణమాలోచించి, ఒక నిర్ణ యానికి కొచ్చిన వాడిలా తల తాటించాడు జాన్. భానుమూర్తికి మాత్రం అంతా అయోమయంగా వుంది. ప్రయత్నించిన ప్రతిచోటా నిరాశే ఎదురవటం అతనికి చాల బాధనిపిస్తోంది-

"సరే రంగయ్యా- అరగంటలో నేను స్కూలు తాళాలు తీసుకుని వస్తాను నువ్వు మాత్రం తలుపులు తెరవాలి. కాస్త మెలుకువగా వుండు, అంటూ మోటర్ సైకిల్ స్టార్ట్ చేశాడు జాన్-


"ఇది సంభవమేనా?" అన్నట్లు చూశాడు భానుమూర్తి అతని వంక ఇతను చెప్పిందే నిజమైతే ట్రైన్ సరిగ్గ 12-45ని॥ లకు స్టేషన్ నుండి బయ దేరుతుంది- మనం పది నిముషాల్లో చేరొచ్చు- ఆ అయిదు ని ము షా ల్లో ప్రిన్సిపాల్ గార్ని కలవ లే క పో ము! అన్నాడు జాన్.

ఒక్క కుదుపులో మోటర్ సైకిల్ బయలుదేరింది. జాన్ ఆ సమయంలో రంగయ్య కళ్ళకి అసాధ్యుడిలానూ, భానుమూర్తికి దేముడిలానూ కన్పించాడు.

భారాన్నంతా జాన్ పైనే వేసి నిముషాన్ని లెక్క పెడు తూ కూర్చున్నాడు భానుమూర్తి అడ్డదారి గుండా వాయు వేగంతో మోటర్ సైకిల్ పరుగెడుతోంది-

దూరంగా రైల్వే స్టేషన్ దీపాలు కన్పించేసరికి ప్రాణం లేచింది- మరొక్క ఐదు నిముషాలు- అవి గడిస్తే ...? అనుకున్నట్టూ జరిగితే...!

భానుమూర్తి ఆలోచనల్లో మళ్ళీ లిల్లి నిలిచింది- ఏభయాందోళనలూ లేకుండా తల్లి పక్కలో వెచ్చగా హాయిగా వుండాల్సిన లిల్లి ఎక్కడుందో?



అసలుందో లేదో? ఆ ఆలోచనకు మనస్సు కల్కుమంది-

జాన్ వంక చూశాడు- ఏకదీక్షగా బండిని పరుగెత్తిస్తున్నాడతడు - అతనికే తనకీ ఏమిటి సంబంధం? మనుషుల్లో మానవత్వమింకా చచ్చిపోలేదని పించింది-

సరిగా అదే సమయంలో పరుగెత్తే ఆబండి ఓ గోతిలో పడి, పెద్ద శబ్దంతో గట్టు మీంచి క్రిందికి ఒరిగిపోయింది- ఈ హఠాత్పరిణామానికి ఎగిరి, దూరంగా బురదలో పడి పోయాడు భానుమూర్తి. జాన్ మాత్రం లేచి, ఒడుపుగా బండి లేవనెత్తాడు. పెద్దదెబ్బ లేవీ ఎవరికీ తగల్లేదని తెలిశాక దేవుడి మీదే భారం వేసి మళ్ళీ బండిని రోడ్డెక్కించారు. 'గోతిలో నిండా నీరుండటాన్ని కన్పించలేదు. ఐయాం సారీ' అన్నారు జాన్. భానుమూర్తి కళ్ళలో నీళ్ళు నిండాయాక్షణాన. బాధ వల్ల మాత్రం కాదు!

సరిగా అదే సమయంలో స్టేషన్‌లో రైలు కూత వేసింది- మరోక్షణంలోనే రొద చేసుకుంటూ వెళ్ళి పోతున్న రైలు బండి వారిద్దరికే కన్పించింది.

ం ం ం

.... చెట్టు కొమ్మల్ని ఆధారం చేసుకుని, నెమ్మదిగా గోడ మీదికి ప్రాకి, కిటికీ చువ్వలకు చుట్టుకుంది.... కొండ చిలువంత పొడవున్న ఆ పాము- అలి కిడికి కళ్ళు, విప్పి కిటికీ వంక చూసింది లిల్లి!

– అంతే! కెవ్వుమన్న కేకతో లేచి కూర్చుంది వసంత.

అమె వళ్ళంతా చెమటతో తడిసి పోతోంది భయంతో వణికి పోతోంది! ఇది మానసిక బలహీనత వల్ల కలిగిన శంకే కావొచ్చు. కానీ ... నిజం కాకూడదని ఎక్కడుంది? విశాలమైన ఆ స్కూలు ఆవరణంలో తోటలో ఓ పాముందని అంటారు. అంచేత చీకటి పడేవరకూ ఎవరూ అక్కడ ఆడుకోరు- అదే నిజమైనపుడు యీ వాతావరణానికి ఆ ప్రాణి కూడ తన ప్రాణరక్షణ కోసం

ప్రాకులాడితే ... అది, అదే తుఫానులో చిక్కుకు పోయిన మరో చిన్ని మానవ ప్రాణిని పొట్టన బెట్టుకుంటే..........

వసంత గుండెల్లోని దుఃఖం సముద్రమై పొంగిందొక్కమారు- సరిగ్గా అప్పుడు గోడగడియారం రెండు గంటలు కొట్టింది నిశ్శబ్దం నిశీధిరాత్రి ఆ రెండు గంటలూ ఆమెలో ఎన్నో ఆలోచనలు రేపాయి.

తలుపు తట్టిన చప్పుడైతే ఆత్రంగా లేచి వెళ్ళి తలుపు తీసి ఆశ్చర్యంగా నిలబడిపోయింది- ఎదురుగా పోల్చుకోలేని స్థితిలో భానుమూర్తి ... అతని వెనుక జాన్!

"నువ్వు భయపడ్డట్టు లిల్లి స్కూల్లో మాత్రం లేచు వసంతా" అన్నాడు భానుమూర్తి అని నెమ్మదిగా లోపలికొచ్చి కుర్చీలో కూర్చుంటూ-

"మరి ........?"

సరిగ్గా అదే సమయంలో అక్కడికి సుమారు రెండొందల కిలోమీటర్ల దూరంలోవున్న లిల్లి కళ్ళు విప్పింది- పరిసరాలను చూసి భయంతో గావుకేక వేసింది.

○ ○ ○

ఉదయం పదకొండు- భయంకర నిశ్శబ్దం చోటు చేసుకుందా ఇంట్లో ఆకలి దప్పులు మరచి చెరో గదిలోనూ కూర్చున్నారు భానుమూర్తి వసంతా. ఆశ నిరాశల మధ్య వూగేసలాడే పెండ్యులంలాంటి వారి ఆలోచనలు నిశ్చలస్థితికి చేరుకుంటున్నాయి-




స్కూలు పిల్లల ఎవరింట్లోనూ లిల్లి లేక పోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది- ఇక రావలసింది ఒక్క- పోలీసు సమాచారమే- ఆ ఘనీభవించిన నిశ్శబ్దంలోంచి భారంగా, భయంకరంగా కొండశిలువలా కదుల్తోంది కాలం.

○ ● ○ .

తలుపు తట్టిన చప్పుడైతే అటుయిటు భయంగా చూసింది వసంత ఎటువంటి వార్త వినాల్సి వస్తుందో, ఎటువంటి దృశ్యాన్ని చూడాల్సి వస్తుందోనని వణికి పోయింది- అయినా నెమ్మదిగా లేవ బోయింది- అప్పటికే తలుపు దగ్గర భానుమూర్తి వున్నాడు. అతనూ అదే స్థితిలో-

"మమ్మీ"

ఈ మాట తన చెవులను తానే నమ్మ లేక పోయింది వసంత. గుమ్మం వైపు పరుగెత్తింది వేయి ఏనుగుల బలంతో- అప్పటికే భానుమూర్తి తలుపులు తెరిచాడు-

చేతిలో బోలెడు పుస్తకాలతో యింట్లోకిఅడుగు పెట్టింది లిల్లి- కలా నిజమా అన్నట్లు అచేతనంగా నిలబడిపోయారిద్దరూ- మరుక్షణంలో లిల్లిని పట్టుకొని ముద్దులు కురిపించారు. వారి కళ్ళ వెంట ఆనంద భాష్పాలు రాలేయి.

"ఎందుకేడుస్తారూ నేను తప్పి పోయినా వచ్చేశానుగా! యీ బొమ్మల పుస్తకాల అంకుల్ చాల మంచివాడు- మనిల్లు తెలీక పోయినా తెచ్చేశాడుగా నేనే చెప్పాలే!

అప్పుడు చూశారు లిల్లి వెనుకనున్న వ్యక్తిని- అతని చేతిలో లిల్లి స్కూలు బేగూ, వాటర్ బాటిలూ-

"నిన్న సాయకాలం మా మొబైల్ లైబ్రరీలో బొమ్మలు చూస్తు నిద్ర పోయిందీ పాప-రాత్రిలేచి ఏడ్చేవరకూ మేమూ చూడలేదు- అప్పటికప్పుడు తిరుగు ప్రయాణమైతే యీ వేళకు చేరుకున్నాం" చెబుతున్నాడతడు-

లిల్లీ... నా బంగారు తల్లీ ...! కూతుర్ని హృదయానికి హత్తుకుంది వసంత.

○ ○ ●

"మరేమో... అప్పుడు అందరూ వెళ్ళి పోయారన్న మాట పాపం. నేనొక్క దాన్నే- బస్సు కూడా లేదు- అప్పుడే బొమ్మల పుస్తకాల బస్సు కన్పించింది- అబ్బ. ఎన్నెన్ని బొమ్మల పుస్తకాలో! వర్షం మొచ్చిందిగద ....... అందుకే ఎంచక్కా...." ....ఆ రాత్రి తల్లికి తండ్రికీ మధ్య పడుకొని ఉదంతాన్ని వివరిస్తోంది లిల్లి!

O

---

జార్జ్ కాఫ్‌మాన్ న్యూయార్క్ నాటక రచయిత, విమర్శకుడు ఒకసారి బ్రాడ్వేలో ప్రదర్శింపబడిన ఓ చెత్త హాస్య నాటకం గురించి రివ్యూ రాశాడు.

"థియేటర్ వెనుక వినబడుతోన్న నవ్వులను బట్టి తెలుస్తోందేమిటంటే అక్కడెవరో జోకు లేస్తుండి ఉండాలి..."